## మనసులో మాట

"నా నుడి" అనే ముందుమాట ద్వారా నా అంతరంగ భావతరంగాలను విశ్లేషిస్తూ, తనదైన, అరుదైన శైలిలో అభినందిస్తూ వెన్నెల మెట్లపై పదం పదం కలిపి చూడండి అంటూ "వెన్నెల మెట్లు"కు బంగరు అంచును తొడిగి సొగసు చేకూర్చిన కవివరేణ్యులు, మానవీయ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి డా॥ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్., గారికి,

"కేరా కవిత్వ రాజ్యశ్రీ కేతనం" అంటూ వెన్నెల మెట్లకు రెక్కలు తొడిగి, విహరింపచేయడమేకాక చేరా, బురా, నారా సరసన 'కేరా' అంటూ నన్ను కూడా చేర్చి, సాహితీ లోకంలో నాకొక స్థానం కల్పించి, కవయిత్రిగా నన్నభిమానించి, శుభాకాంక్షలందించిన, కవి, విమర్శకులు శ్రీ సుధామగారికి,

రెక్కల ప్రక్రియవైపు నన్ను ప్రోత్సహించి, అమిత శ్రద్ధతో సరిచూసి, నా ఒరవడిని అభినందించి, తన శుభాకాంక్షలు అందించిన ఆత్మీయులు, రెక్కల రూపశిల్పి సుగమ్ బాబుగారికి,

ఆశీఃపూర్వక శుభాభినందనలు తెలియచేసిన ప్రముఖ కవి, పర్యావరణ వేత్త తూములూరి రాజేంద్ర ప్రసాద్‌గారికి,

నానీలు, మినీ కవితలు, వచన కవితలు రాసిన మీరు 'రెక్కలు' కూడా రాస్తే బాగుంటుందనీ, రాయగలరనీ పదే పదే గుర్తు చేసి ఆ దిశగా నన్ను ఆలోచింప చేసిన పెద్దూరి వెంకట దాసుగారికి,

కవి మిత్రులు శ్రీ పొత్తూరు సుబ్బారావు, మౌనశ్రీ మల్లిక్, సాహిత్య ప్రకాష్, మోపిదేవి రాధాకృష్ణగార్లకు,

'రెక్కలు' రాస్తున్నాను అనగానే ఆవిష్కరణ తేదీ ఖరారు చేసి, హాలు బుక్‌చేసి, పుస్తకం విడుదల చేసిన జి.వి.ఆర్. ఆరాధన సంస్థ అధ్యక్షులు శ్రీ గుదిబండి వెంకట రెడ్డిగారికి,

డి.టి.పి. చేసిన కె. బాలకృష్ణగారికి, ఈ రెక్కలు ప్రచురించి ప్రోత్సహించిన "సాహితీ కిరణం", "ముంబయి వన్", "నేటి నిజం", "చినుకు", "గొరువాస్తు" మొదలైన పత్రికల సంపాదకులకు,

వివిధ పత్రికలలో ప్రచురింపబడిన నా 'రెక్కలు' చదివి అభినందలనలు తెలియచేసిన సాహితీ మిత్రులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు.

**కె. రాజ్యశ్రీ**

# వెన్నెల మెట్లు

## రెక్కలు

**కేతవరపు రాజ్యశ్రీ**

ప్రచురణ - 2011

**వెన్నెల మెట్లు**

**కె. రాజ్యశ్రీ**

ప్రథమ ముద్రణ: ఏప్రిల్, 2011

కాపీలు : 500

హక్కులు రచయిత్రివి

వెల : రూ.40/-

గ్రంథాలయ ప్రతి : రూ.50/-

ప్రతులకు:

**శ్రీమతి రాజ్యశ్రీ**

ప్లాట్ నెం.301, గోకుల్ అపార్ట్‌మెంట్స్

స్ట్రీట్ నెం.4, అశోక్ నగర్, హైదరాబాదు - 500 020.

ఫోన్ : 2767 0267

డి.టి.పి. :

కె. బాలకృష్ణ, హైదరాబాదు.

సెల్ : 95506 81039

ముద్రణ :

# అంకితం



ప్రియమైన శ్రీవారు

కేతవరపు మాధవరావుగారికి

అనడంలో "Face is the index of mind" అన్న విషయాన్ని చెప్పడం మటుకేకాదు. 'ముఖమే మాట్లాడుతుంది' అన్న చిరంతన సత్యాన్ని దీపింపచేశారు. "నోరుమాట్లాడుతున్నా నొసలు వెక్కిరిస్తుంది' అన్న సామెత-ముఖంలో ప్రతిబింబితమయ్యే భాషకు భిన్నమైన భావవ్యక్తీకరణకు నిర్దేశింపబడిందే కదా! 'ఆమెకళ్లు మాట్లాడతాయి' అని సినీనటి అభినేత్రి సావిత్రి గురించి చెప్పుకుంటాం. అలాగే-మాటలు చెప్పలేనివి, మౌనంగా, ముఖకవళికలు చెప్పగలవు. ఇంతటి విశ్లేషణాత్మక భావాన్ని-కే.రా ఇందులో పొందుపరిచారు.

శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ ఉద్యోగిని, ఒక గృహిణి, స్త్రీగా చేతనాశీలి. మునుపటిలా స్త్రీలు గృహంలో కష్టపడడంలేదనీ, విసురుకోవడాలూ, దంపుకోవడాలూ, వండుకోవడాలలో ఎన్నో సౌలభ్యాలు వచ్చాయనీ, ఇదంతా ఆధునిక స్త్రీ శ్రమను తగ్గించివేసిన వర్తమానమేననీ అనేవారున్నారు. కానీ-

**ఎన్ని ఆధునిక**
**సౌకర్యాలున్నా**
**విశ్రాంతి**
**దొరకడం లేదు**

**యంత్రం**
**యంత్రమే**

అంటూ, స్త్రీయే యంత్రంగా మారిపోతున్న స్థితిని రూపుకట్టించారు. దేవుడు అంతటా వుండలేక అమ్మను సృష్టించాడని అంటారు. అవునా! "యుగానికో అవతారం - సృష్టించాడు బ్రహ్మ - రోజులో పది అవతరాలు - ఎత్తుతుంది అమ్మ.... తండ్రిని మించిన తనయ' అనడంలో - స్త్రీ శ్రమ ఔనత్యం ప్రతిఫలిస్తోంది. 'అమ్మ - అమృతత్వం - నాన్న - గాంభీర్యం - వెన్నపూసపై - మీగడతరక'లా పోలుస్తారు కవయిత్రి.

ఇప్పుడంటే వైద్యం ఇంత విస్తృతము, ఖరీదైనదీ అయిందిగానీ, ఒకప్పుడు ఆరోగ్యపరిరక్షణలో - ఇంట్లో - బామ్మలూ, అమ్మమ్మల చిట్కా వైద్యాలు గొప్ప ఉపశమన మిచ్చేవిగా వుండేవి. 'అపర - ధన్వంతరీలు - మన - బామ్మలు - తరలిపోతున్న - వృద్ధ సంపద!' అని అన్నారందుకే. ఆడపిల్ల నిచ్చుకున్నవారి బాధ్యతలు, ఎంతకాలంమారినా - అలాగే వుంటున్నాయన్న దానికి వ్యాఖ్యానంగా - 'పురిటి ఖర్చులు - పుట్టింటివి. ముద్దుమురిపాలు - మెట్టినింటివి - తిరగరాయడం - ఎవరితరం?' అని వాస్తవచిత్రణం చేశారు.



**Dr. K.V. Ramanachary,** I.A.S.,
Prl. Secretary to Government
(Endowments)

**Revenue Department**
Room No. 516, 5th Floor, L-Block,
A.P. Secretariat, Hyderabad-500 022.
Office Tele No. : 040-2465 0160

# నా 'నుడి'

పక్షి
తను వాలిన
చెట్టునుగానీ,
కొమ్మనుగానీ,
నమ్ముకోదు..
తన రెక్కలను తప్ప.

పక్షి
శ్రామికునికి
సంకేతం.
రెక్కల కవీ అంతే.
శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ
కవయిత్రిగా
రచయిత్రిగా
కావ్యకర్తగా
కార్యకర్తగా
సెక్రెటేరియట్
ఉద్యోగుల్లో
సాహితీ మిత్రులైన
చాలా మందికి
తెలుసు.


**'సముద్రం**
**ఎన్ని ఆటుపోట్లున్నా**
**దాటదు తీరం**
**దాంపత్యమూ**
**అంతే!'**

ఆలూమగల
మధ్య
ఎన్నో భేదాభిప్రాయాలున్నా-
ఎంత విభేదమున్నా-
సముద్రంలా
చెలియలి కట్ట
దాటకుండా వున్న
దాంపత్యమే
దాంపత్యమన్న
శ్రీమతి రాజ్యశ్రీగారి
కవితలోని భావం
ఎందరికో అనుభవైకవైద్యం.

**'కొలిమిలో**
**కాలుతున్నా**
**వ్యక్తిత్వం**
**ఉన్నతంగా**
**మేలిమి**
**బంగారం!'**

కొలిమిలో
కాలినప్పుడే
బంగారం
పసతేలుతుంది.
మేలిమి బంగారంగా
రాణిస్తుంది.
పసిడి మిసిమిని

వెదజల్లుతుంది.
ఎదురుదెబ్బలెన్నెన్నో
తట్టుకొన్న
మనిషి
వ్యక్తిత్వమూ
అంతే.
పిండితార్థం
సులభం.
ఇలా ఎన్నెన్నో
తమ కవితల
ద్వారా
ఎగిరే
రెక్కల్తో
భావాంబర వీధిలో
పాఠకులను
విహరింప
చేయడమే
శ్రీమతి రాజ్యశ్రీ
లక్ష్యం కాబోలు.
తమ లక్ష్య సాధనలో
శ్రీమతి రాజ్యశ్రీ
ఎంతవరకు
కృతకృత్యురాలయిందో
మీరూ
ఈ వెన్నెల మెట్లపై
మీ పదం పదం
కలిపి చూడండి.



(డాక్టర్ కె.వి. రమణాచారి)



**సుధామ**
(కవి, విమర్శకులు
స్వచ్ఛంద విశ్రాంత ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారి)
**జి-12, సాదత్‌టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్, సలీంనగర్ కాలనీ,**
**మలకపేట, హైదరాబాదు-500 036. సెల్: 9849297958**



# కేరా కవిత్వ రాజ్యశ్రీ కేతనం

చేరా, బురా, నారా, అని పురుషసాహితీవేత్తలు తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధులై వున్నారు. అలా స్త్రీలలో ఆరుద్రగారి ధర్మపత్ని కె. రామలక్ష్మిగారిని 'కేరా' అని, 'కేరాత్రిశతి' కూడా రచించారు ఆరుద్ర. ఇప్పట్లో మరి-'కే.రా' అంటే కేతవరపు రాజశ్రీ గారని చెప్పాలి.

సాధారణంగా కార్యకర్తలు, కావ్యకర్తలుగా రాణించడం అరుదు. సాహిత్యాభిలాషతోనే మొదలై- ఏ సాహిత్య, సాంస్కృతిక సంఘనిర్వహణా బాధ్యతలో తీసుకున్నప్పుడు, ఇంక తాము స్వయంగా రచన చేసే సమయం, వెసులుబాటు దొరకక రచనాభిలాషకు విరామమిచ్చి, కార్యనిర్వహణలోనే వుండిపోతూంటారు చాలామటుకు కొందరు.

కానీ మన కే.రా (కేతవరపు రాజ్యశ్రీ) గారు అలాంటివారు కాదు. రాష్ట్ర ప్రభుత్వ సచివాలయ సాహితీ సాంస్కృతిక సంస్థ 'చేతన' కార్యనిర్వాహకురాలిగా చైతన్యశీలిగా వుంటూనే - కవయిత్రిగా, రచయిత్రిగా తన రచనాభిలాషను పండించుకుంటున్నారు. ఆ క్రమంలో ఇప్పుడు కే.రా వెలువరిస్తున్న **"వెన్నెల మెట్లు"** - 'రెక్కలు'- ఆమె కవితారచనా పాటవానికి ప్రతీకగా గ్రంథస్థమవుతున్నాయి.

ఆరుపాదాలుగా సాగే 'రెక్కలు' శ్రీ యం.కె. సుగమ్ బాబు ప్రాచుర్య పరిచారు. మొదటి నాలుగు పంక్తులనూ చివరి రెండు పంక్తులు కవిత్వరసాను భూతిలోకి ఆరోహణపరుస్తాయి. రెక్కలు విచ్చుకోవడానికి ఇతివృత్తం పరిసీమిత మేమీకాదు. వ్యక్తిగత, అంతర్గత, సమాజగత ఏ అంశమైనా రెక్కల్లో ఒదిగిపోతుంది. అనుభూతి విహాయసంలోకి ప్రయాణింపచేస్తుంది.

**భావాలను**
**భాషతోనే కాదు**
**మౌనంతో**
**కూడా**

**ప్రతిబింబం**
**ముఖం**

**Tumuluri Rajendra Prasad**
B.Sc., M.A., (JMC), M.A. (Soc)
National & International Awardee, Frelance Journalist, Writer,
Radio New Reader, Viswadata Awardee, T.V. Moderator,
Vijayawada - 520 001.
Cell : 9490332323, Phone: 0866-2560407, 2560807



# శుభాకాంక్షలు

“ఒక చిత్రం శబ్ధరహిత కవిత్వం
ఒక కవిత్వం శబ్దంతో కూడిన చిత్రం”

అన్నట్టు నవ్య భావాల్ని ప్రతిఫలిస్తూ, ప్రతి కవితలో ఏదో ఒక విశిష్టతను ఆవిష్కరిస్తూ 'రెక్కలు' పేరుతో మినీ కవితా సంకలనాన్ని సమాజానికి అందిస్తున్నందుకు రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీగార్కి అభినందనలు.


అక్షరానికి శక్తి వుంది. పదానికి ప్రాణం వుంటుంది. అలాంటి శక్తివంతమైన అక్షరాలతో పదాలను పేర్చుకుని భావయుక్తంగా, అర్థవంతంగా కూర్చుకుని మినీ కవితా రూపంలో సాహిత్య వినీలాకాశంలో 'రెక్కలు' విచ్చుకుని 'కవితా విహంగా'ల్లా ఉల్లాసంగా విహరిస్తున్నట్టున్నాయి కవితలన్నీ.

*"A poem should be wordless*
*As the flight of birds"*

కవిత శబ్దాలు లేకుండా పక్షులు ఎగురుతున్నట్లు వుండాలట. కవిత అర్థాన్ని ఇవ్వాలి. అపుడే పాఠగుడికి ఆలోచనవస్తుంది. ఎపుడయితే ఆలోచనలో పడేస్తుందో అపుడే ఆ కవిత బుద్ధి ప్రధానమైనదిగా వుంటుంది. రాతిలో రాతిని దర్శించగలడు కవి. మసిలో శశిని తిలకించగలడు కవి. శూన్యంలో పూర్ణతను చూడగలడు.

అలాంటి కవితలకు ప్రాణం పోసిన రచయిత్రిగా కేతవరపు రాజ్యశ్రీ గుర్తింపు పొందారు. గతంలో 'ఊహల వసంతం', 'సిసింద్రీలు' కవితలు చదివాను, అందులో సమాజాన్ని ఆలోచింపజేసే తత్వం గోచరిస్తుంది. మనిషి అంటే కేవలం మనసు మాత్రమే కానట్లు, సాహిత్యం అంటే కేవలం భావం మాత్రమే కాదు. బాహ్యరూపము, ఆంతరిక భావము రెండు వుండాలి.

రచన మనసు నుండి జనిస్తుంది. అందుకే అది మేధాజనితమైన దయింది. కవితలు అందరూ రాస్తారు. ప్రస్తుతం లక్షల సంఖ్యలో రాస్తున్నారు కూడ. భావాలను వ్యక్తపరచడం సులభమే. కాని అనుభూతుల్ని మేల్కొలపడం కష్టం. ఇలాంటి కష్టసాధ్యమైన పనిని చేస్తున్న కేతవరపు రాజ్యశ్రీ గార్కి మరోసారి అభినందనల శుభాకాంక్షలు. మున్ముందు ఇటువంటి, ఇంత కంటె మరిన్ని మంచి కవితలకు ప్రాణంపోయాలని ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ.. శెలవ్.





కేరాలో ఒక నిశిత పరిశీలకురాలు వుంది. తన చుట్టూ మనుష్యులనూ, సమభాన్ని మాత్రమే కాదు అంతరంగంలోకీ తొంగిచూసుకోవడంలోనూ అది ప్రతిఫలిస్తుంది. 'ఏమీలేనినాడు - అన్నివున్నవాడు - కూడా - అసంతృప్తే.... మాయదారి మనసు!' అని అన్నా, 'ప్రేమకోసం - పరితపించా... తలుపుతట్టింది - ఆలస్యంగా - వలపుకు - వయసేమిటి?' అన్నా, 'కన్నీరు-నిశ్శబ్దంగా - ఓదార్పునిస్తుంది - అమూల్య - వరం” అని పేర్కొన్నా-' వ్యష్టినుంచి సమష్టికి అనువర్తించే భావబలిమిని స్పష్టపరిచారు రాజ్యశ్రీ.

ఈ కవయిత్రి సమాజంలో సామరస్యాన్నీ, మనుషుల మధ్య సౌమనస్యాన్ని అభిలషిస్తారు. 'అడ్డునిలిచిన - కొండ - పక్కకి తొలగి - నీటి పాయ - అధిగమనమే - ఆధిక్యత' అని సూత్రీకరించడం అలాంటి సౌజన్యమే! 'నమ్మించి - మోసంచేసినా - ఆమెగర్భంలో - అతనికిచోటు - ప్రేమ - పరాకాష్ట' అనడం తనకే చెల్లింది. 'డీగ్రీలు కోల్పోతున్న జీవననానందం అస్థిరత మూల్యం 'అంటూ నేటి యువత కెరీర్ వెంట పరుగులతో పోగొట్టుకుంటున్న అమూల్య ఆనందం గురించి ప్రస్తావించారు అటువంటి కొందరికి హెచ్చరికగా.

ఇలా ఉటంకించుకుంటూ పోతే పీఠకలోనే పుస్తకం పునర్ముద్రణ మయ్యేట్లుంటుంది! ఏమయినా కవయిత్రి అన్నట్లు-

**బండరాయిని**
**కరిగించగల**
**శక్తి**
**కవిత్వానిది**

**మహనీయం**
**మానవత్వం**

మానవత్వం పరిమళించడానికి సద్గ్రంధపఠనం, సజ్జనసాంగత్యం ఉపకరణాలవుతాయి.

**పూలమీంచి**
**వీచినగాలి**
**పులకింత**
**సుగంధం**

**సజ్జన**
**సాంగత్యం**

అంటారు కవయిత్రి. మరి ఆమైత్రీ భావంతోటేగా ఈ ముందుమాటలూనూ! ప్రక్రియ, ప్రక్రియ లక్షణాలు, కొలతలు, కొలమానాలు ఇవన్నీ అటుంచి, అనుభవాలను అనుభూతి

రమ్యంగా అభివ్యక్తం చేసి, రసోద్దీపనం కావించిడమే కవిత్వంలోని ప్రధానాంశం! నూటికినూరుశాతం అన్నీ అందరికీ, అన్ని వేళలా, నచ్చాలని ఏంలేదు!

**తీరనికోరికుంటేనే**
**బ్రతుకుతీపి**
**విమర్శతోనే**
**ప్రతిభ వెలికి**

**తెలిందే**
**నిజం**

అని కవయిత్రికి తెలుసు. ఎదిగిన కొద్దీ ఒదిగివుండే సంస్కారం ఇది.

శ్రీమతి కేరా (కేతవరపు రాజ్యశ్రీ) 'రెక్కలు' - బ్రతుకుతీపి పెంచే, మానవీయ కవిత్వ నివేదనం గూర్చిన తపనతో విచ్చుకున్నవే! కావ్యకర్తగానూ మరెన్నో ప్రతిభా రాజ్యశ్రీలను దక్కించుకునే, రచనాకేతనాలను ఆమె ఎగురవేయాలని నా ఆకాంక్ష. ఈచిరుపొత్తం పాఠక సమాదరణీయం కవాలని శుభాకాంక్షలతో.....

సదా మీ

శత వసంత మహిళా దినోత్సవం — **సుధామ**

**08.03.2011**



**యం.కె. సుగమ్ బాబు**
'రెక్కలు' రూపశిల్పి
**502, సాయి తేజ ఎన్‌క్లేవ్, సూరారం 'ఎక్స్' రోడ్స్,**
**హైదరాబాదు-500 055. సెల్: 80966 15202**

# జీవితం ప్రవహిస్తుంది రెక్కల్లో...!

'రెక్కలు' ప్రక్రియ గుణగణాలను విప్పిచెప్పటం తేలిక్కాదు. ఒక విమర్శకుడు, వేదా సమీక్షకుడు మొదట ప్రక్రియకు సంబంధించిన నిర్మాణాన్ని, ఉద్దేశాన్ని క్షుణ్ణంగా అర్థంచేసుకోవాలి. అంతమాత్రమే చాలదు. సాధికారంగా చెప్పడానికి తన జీవితాను భవాలను కలబోసుకోవాల్సి వుంటుంది. ఇలా అధ్యయనం చేయగలినవారికే రెక్కల అంతర్యం బోధపడుతుంది. కనుక ఇది పైపైన రాసేవారికి కష్టమైన పనే.

రెక్కలు సంపుటానికి ముందుమాట (Preface) రాయడమంటే ఒక ప్రమాణ పత్రాన్ని రాయడమే. పరిశోధకులకు లక్షణాలను వివరించడమే. ఇది చాలా బాధ్యతా యుతమైన పని. డా॥ అద్దేపల్లి రామమోహనరావు మొదలుకొని డా॥ కె.వి. రమణాచారి వరకు అనేకమంది సాహితీ విమర్శకులు 'రెక్కలు' ప్రక్రియ విశిష్టతను చాటారు. చాటుతూనే ఉన్నారు. వారందరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపు కొంటున్నాను. అలాగే-

రెక్కలు ప్రక్రియలో "వెన్నెల మెట్లు" చిత్రించిన కవయిత్రి శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీకి నా శుభాకాంక్షలు అందజేస్తున్నాను. ఈవిడగారు అతి తక్కువ సమయంలో వందరెక్కలు రాసి పలకరించడం నన్ను ఆశ్చర్యపర్చిన విషయం.

'Those who wish to sing a song, always find a song' అన్నాడో మహాకవి. మరి రాయాలనుకున్న వారికి? 'రెక్కలు' రాజ్యశ్రీ గారి ఒడిని చేరాయి.

**"పిట్టకు**
**తన గుండెలోనే**
**గూడు కడుతుంది**
**చెట్టు-**

**మాతృ**
**ప్రేమ!"**

చిన్న చిన్న పదాలు. బ్రహ్మాండమైన భవన నిర్మాణంలో ఇటుకల్లాగ. గొప్ప చాతుర్యం. చెట్టుకు మానవ హృదయం పొదిగారామె. అలా అలా అద్భుతంగా 'నూరు రెక్కలు' తెలుగు సాహిత్య గగనంలో ప్రతిష్ఠించారు, 'వెన్నెల మెట్లు'గా!

జీవితంలో తారసపడే ప్రతి సంఘటనలోని అంతర్యాన్ని గ్రహించడానికి కవి చేసే కృషిలోనే రెక్కల పురివిప్పుకుంటాయి. ప్రతి మాటను, ప్రతి సందర్భాన్నీ శోధించే పనిలో రెక్కలు కవులు నిమగ్నమైవుంటారు. అంచేత ప్రతి రెక్కలోనూ జీవితం కొత్తగా ప్రస్తావించబడుతుంది. ఇదొక ప్రాసెస్!

జీవితం ప్రవహిస్తుంది రెక్కల్లో!-

**15.03.2011** — **యం.కె. సుగమ్ బాబు**

కురుక్షేత్ర సంగ్రామం
కళ్లకు కట్టినట్టు
సంజయుడి
దివ్యదృష్టితో

ద్వాపర యుగంలో
దూరదర్శన్!

# వెన్నెల మెట్లు

ఆల్బం
తెరచిచూడు
మురిపిస్తుంది
బాల్యం...

జ్ఞాపకం
ఆనంద గీతం!

పూల మీంచి
వీచిన గాలి
పులకిత
సుగంధం

సజ్జన
సాంగత్యం!



అప్పటిదాకా
అది చిత్రాన్నం
నివేదన కాగానే
ప్రసాదం...

భావనలో అయింది
పవిత్రం!

అమ్మ కోసం
పాప ఏడుపు
ఎన్ని బొమ్మలిచ్చినా
మానదే

అమ్మ అమ్మే
బొమ్మ కాదు!

కొలిమిలో
కాలుతున్నా
వ్యక్తిత్వం
ఉన్నతంగా

మేలిమి
బంగారం!





యుగానికో అవతారం
సృష్టించాడు బ్రహ్మ
రోజులో పది అవతారాలు
ఎత్తుతుంది అమ్మ...

తండ్రిని మించిన
తనయ!

ముక్కుపచ్చలారని
వాడికి అల్పాయుష్షు
కళ్లూ, కాళ్లూలేని
ముసలికి పూర్ణాయుష్షు

సంచితం
ఎంత తెచ్చుకుంటే అంత

చేరాల్సింది
పరమాత్మనే
బాబాలు, యోగులు
మార్గదర్శకులు

చీకట్లో
దారిదీపాలు!

ఎదిగిన
కొద్దీ
ఒదగ
మన్నారు...

వినమ్రతే
ఔన్నత్యం!





కంచె
దాటకుండా
కత్తిరిస్తేనే
అందం...

ఇంటి పరువూ
అంతే!

ఏమీ లేనినాడు
అన్నీ ఉన్ననాడు
కూడా
అసంతృప్తే...

మాయదారి
మనసు!

పిట్టకు
తన గుండెలో
గూడు కడుతుంది
చెట్టు...

అమ్మతనం
అనిర్వచనీయం

అమెరికా వెళ్లేందుకు
చాలదు పర్సు
క్షణాల్లో అమ్మాయిని
పలకరించొచ్చింది మనసు

మనోవేగం
అమూల్యవరం!

శిఖరాగ్రం
పై
నిలవాలని
ఆరాటం...

ఏదీ
కాదు శాశ్వతం!

అమ్మ
అమృతత్వం
నాన్న
గాంభీర్యం

వెన్నపూసపై
మీగడతరక

ఇష్టమున్నా
లేకున్నా
కొన్ని పనులు
తప్పనిసరి...

గానుగెద్దు
జీవితం!

మంచి
నేస్తముంటే
స్వర్గతుల్యం
జీవితం

పంచుకోవడంలోనే
ఆనందం!

పురిటి ఖర్చులు
పుట్టింటివి
ముద్దు మురిపాలు
మెట్టినింటివి

తిరగరాయడం
ఎవరితరం?

సముద్ర మథనంలోంచి
అమృతం
హృదయ మథనంలోంచి
కవిత్వం

మథనలోంచే
సృజన!

గడ్డ కట్టే
చలిలో
దేశాన్ని రక్షించే
వీరజవాను

కంటికి
రెప్ప!

అపర
ధన్వంతరీలు
మన
బొమ్మలు

తరలిపోతున్న
వృద్ధ సంపద!





అతిథిలా వచ్చాక
అలాగే వెళ్ళిపోక
కూడబెట్టాలనే
తపనేమిటి?

సంసార
మాయ!

అడ్డు నిలిచిన
కొండ
పక్కకి తొలగి
నీటిపాయ

అధిగమనమే
ఆధిక్యత!

ప్రేమకోసం
పరితపించా...
తలుపు తట్టింది
ఆలస్యంగా

వలపుకు
వయసేమిటి?

మన దేశానికి
గర్వకారణం
సంస్కృతీ
సంప్రదాయాలు

పడమటి గాలికి
రెపరెప!

పుస్తకాల
పురుగు
ఎంత తిన్నా
ఆకలే

తరగని గని
విజ్ఞానం!

గుప్పెడంత
గుండెలో
విశ్వప్రేమ
ఘోష...

సెల్‌ఫోన్
సరాగాలు!

లంగా, ఓణీ
రోత
మినీ శారీ
నవ్యత

పాత సీసా
కొత్త సారా!

నాకెన్ని భాషలొచ్చో
'క' భాష
'గ' భాష
'చిలక' భాష

చక్కిలిగింత
చిలిపితనం!





నాన్న వెంట
కవిసమ్మేళనానికి...
అంతర్లీన ఆర్తి
కవితగా మారింది...

మల్లె సుగంధం
దారానికి!

పక్కింట్లో
దొంగతనం
కొందరికి
ఆనందం

శాడిజం!
అంతర్గతం

కొందరిది
విశ్వప్రేమ
తన మన
వుండదు

కారణ
జన్మలు

తన
నీడను
చూస్తేనే
భయం

మనిషికి
తానే శత్రువు!





చెట్టుకింద
బిచ్చగాడి సంసారం
ఎండావానల్లో
పక్కకి జరిగి ఆశ్రయం

విశాల
హృదయం

తాగుడు
సమాజంలో
మగాడి
స్టేటస్ సింబల్

బలిపశువులు
భార్యా పిల్లలు!

జగజ్జేత
అలెగ్జాండర్
మృత్యువుకు
సరెండర్

అంతం
మరణం!

కోయిల పాట
వసంతంలోనే
నెమలి నర్తనం
వర్షఋతువులోనే

ప్రకృతికి
ఆత్మార్పణం





వృద్ధాప్యం
కొందరిని
చూసి
సిగ్గుపడుతుంది

జ్ఞాన
సంపన్నులు

ఒకే కడుపున
పుట్టిన
వారిమధ్య
విభేదాలు

భార్యా
భర్తలెంత?

తలపాగ
నేత నెత్తికెక్కి
కోటలో వేసింది
పాగా

ప్రజాస్వామ్య
విజయం



లైలా, మజ్నూ
సలీం, అనార్కలి
నిలిచిపోయారు
చరిత్రలో

విఫల ప్రేమకు
శాశ్వత కీర్తి!

కన్నీరు
నిశ్శబ్దంగా
ఓదార్పు
నిస్తుంది

అమూల్య
వరం



ఈటెల్లాంటి
మాటలకు
జవాబు
తృణీకార భావం

పదునైనది
మౌనం!

కడ
దాకా
తోడుంటానని
బాస

గాలిలో దీపాలు
ప్రమాణాలు

"ఎయిడ్స్"
వస్తే
'ఎయిడ్'కి
ఎవరూ రారు

గాడి తప్పిన
జీవితం





అమావాస్య
మంచి అరవ్వాళ్లకి
అన్నింటికీ అడ్డం
తెలుగు వాళ్ళకి

నమ్మకాలే
మంచీచెడూ

మానసిక
ఆనందం
శారీరిక
ఆరోగ్యం

స్వర్గతుల్యం
జీవితం

నన్ను నేను
తరచి
చూడడం
మొదలెట్టా

చూపుడు వేలు కూడా
నావైపు తిరిగింది

ప్రశాంత
వదనం
అసమాన
సౌందర్యం

వెన్నెల
సెలయేరు

ఊహలకి
వాస్తవాలకి
వారథి
కవి

వెన్నెలరేడు
చందమామ!

రత్నాలే!
వజ్రంలా
కోస్తున్నారు
కూడా!

పళ్లున్న చెట్టుకే
రాళ్ళు

కొడుకు
షోకు
తండ్రి
ఆక్రోశం

అతి
ప్రేమ

గాజుల
శబ్దం
వంటింటి
సంగీతం

సంసారం
ఘుమ ఘుమ





ఒకరికి
అది రత్నగర్భ
మరొకరికి
అంతులేని అగాధం

విభిన్న
దృక్పథం!

చదువు లేకున్నా
సంస్కారం
కొందరి
నైజగుణం

పరిమళం
పువ్వు నైజం

అమ్మానాన్నలు
ఏది చెప్పినా
'లైట్'
అంటున్నారు బిడ్డలు

కనిపెంచినందుకు
వెయిట్!



అప్పుడే పుట్టిన
పిల్లి కూనలు
ఎంత
ముద్దుగా వున్నాయో!

శిల్పి
దేవుడు కదా!

అమ్మాయికి
పుట్టినవాడు
మెట్టినింటికి
వారసుడు

స్త్రీవాదానికి
అతీతం

అతడు, ఆమె
అపరిచితులు
మూడు ముళ్ల బంధంతో
దంపతులు

బంధంతో మొదలు
అనుబంధం

పొగపెట్టి
పారదోలడం
తేనె
జుర్రుకోవడం

బలవంతుడిదే
భోగం!

శవం
దుర్గంధంరాకుండా
అగరుబత్తి
సువాసన

వృధా
శ్రమ!





నమ్మించి
మోసం చేసినా
ఆమె గర్భంలో
అతనికి చోటు

ప్రేమకు
పరాకాష్ట

తండాల్లో
జీవనం
బహు
కష్టం

అడవిలో
చెట్టే భవనం!

ఎన్నితరాలకు
సరిపోయేంత
సంపాదిస్తే
తృప్తి?

రూపాయి నాటితే
రూపాయే!

దుఃఖాన్ని
తుడిచేసి
కొత్త జీవితం
ప్రారంభించు

సంకల్పమే
శ్రీకారం!





బతికుండగా
బద్ధ శత్రువు
శవంగా మారగానే
శ్రద్ధాంజలి

ఆనంద
విషాదం!

ఆకాశమంత
ఎదిగానని
నేలను
ధిక్కరించడం

గాలిలో
విన్యాసాలు చేయడం!

నెమలీక
పిల్లల్ని పెడుతుందని
ప్రతిరోజూ
ఎదురుచూపు

అమాయకత్వమే
పసితనం!

తీరని కోరికుంటేనే
బ్రతుకు తీపి
విమర్శతోనే
ప్రతిభ వెలికి

తేలిందే
నిజం!





మనశ్శాంతి
కోసం
తీర్థ
యాత్రలు

ఆందోళన
అంటుకున్న నిప్పు!

ఆలస్యం... అమృతం
విషం
నిదానమే
ప్రధానం

కయ్యాలమారి
సామెతలు!

ప్రేమికుల
రోజు
పెళ్లిచేస్తామంటే
పరుగు

వెరైటీ
నేటి రివాజు



పుట్టుకతో
వచ్చేవి కొన్ని
అనువంశికంగా
మరికొన్ని

పళ్లూడగొట్టే
రాళ్ళు!

వీధి మొగల్లో
ఎదురు చూపు
ఎవరి కోసం?
ఎదురైన ప్రశ్న

అపార్థం
బాణం ములుకు!



చల్లని
ఆశ్రయం
చక్కని
ఆతిథ్యం

వృక్షం
సంస్కృతి

అందానికి
తూకం
కాసులకి
బేరం

పెళ్లి
చూపులు

ఇవాళ్టి
సౌఖ్యంలో
నిన్నటి
బాధ

నేడు కూడా
వృధా





సముద్రం
ఎన్ని ఆటుపోట్లున్నా
దాటదు
తీరం

దాంపత్యమూ
అంతే!

పదవిలోకొచ్చాక
అస్మదీయులను
అందలమెక్కించకపోతే
ఎలా?

సిగ్గు
సిగ్గుపడింది

మంచు
తెరల మీద
సూర్యుడి
లేత కిరణాలు

వెలుగు
ప్రస్థానం!



పశ్చాత్తాపం
మనిషిని
చేస్తుంది
మహోన్నతం

వజ్రానికి
సాన!

మడీ, ఆచారం
చాదస్తం
శుభ్రత
వైజ్ఞానికం

పిల్లంటే
మార్జాలం!



రారాజైనా
రాక్షసుడైనా
మట్టిలో
కలవాల్సిందే

నిష్పక్ష న్యాయం
మరణం!

అర్ధరాత్రి
నిశ్శబ్దం
కవిత్వానికి
గుబాళింపు

సోయగం
వెన్నెల సోన!

మోడువారిన
చెట్టు
చిగురిస్తోంది
అపుడే

తల్లి ఒడిలో
పురిటి బిడ్డ

సంసార బంధంలో
పరిభ్రమణం
ధ్యాస
మోక్షంపైన

పిల్లికలలో
ఎలుక!

బండరాయిని
కరిగించగల
శక్తి
కవిత్వానిది

మహనీయం
మానవత్వం!

ఎన్ని ఆధునిక
సౌకర్యాలున్నా
విశ్రాంతి
దొరకడంలేదు

యంత్రం
యంత్రమే!

భావాలను
భాషతోనే కాదు
మౌనంతో
కూడా

ప్రతిబింబం
ముఖం





ఎడతెగని ఆలోచనల
భాండాగారం
ధ్యానానికి
రవ్వంత చోటు నివ్వదు

కుదురులేని
మనసు

మేడ
నోరు మూయించినవెన్నో
గుడిసెలోంచి
గుప్పు

విప్లవానికి
శ్రీకారం!

వేలెడు
ఎలుక
పెద్ద కొండకు
ప్రశ్నార్థకం

చైతన్యం
జవాబు!

పుట్టగానే
లేగదూడ
అమ్మపొదుగు కోసం
వెతుకులాట

ప్రకృతి
ధర్మం!





డిగ్రీల మీద
డిగ్రీలు
కోల్పోతున్న
జీవనానందం

అస్థిరత
మూల్యం

అతిధిగా వచ్చే
ఆవేశం
మిగిల్చే విషాదం
జీవితాంతం


దుఃఖం
విస్ఫోటనం!

## ప్రచురించిన పుస్తకములు




















అద్దంలాంటి
మనసు
నవ్వితే నవ్వుతుంది
ఏడిస్తే ఏడుస్తుంది

స్వచ్ఛత
దాని నైజం!

మోడువారిన
చెట్టు
అయినా
నిటారుగా

ఆశే
వూపిరి

కవుల
పొగడ్తలకు పొంగి
పున్నమి నాటికి
పూర్ణ చంద్రుడు

ఇక
మనుషులేపాటి?

దేవతలకు
అమృతమే
మనిషికి
షడ్రుచులు

అందుకే
అవతారాలు





రెండంగుళాల
నాలుకకు
ఆరడుగుల మనిషి
బానిస

గాలానికి చిక్కిన
చేప!

చెట్లనిండా
పూలు
కొన్ని మాత్రమే
దేవుని పాదాల చెంత

అర్హత
దైవేచ్ఛ!